
సాక్షి
బాపట్ల
బుధవారం ı 23 ı అక్టోబర్ ı 2024



3న గ్యార్మీ, గంధ మహోత్సవం

భట్టిప్రోలు: హజరత్ మహబూబ్ సుభానీ 13వ గ్యార్మీ, గంధ మహోత్సవం నవంబర్ 3న భట్టిప్రోలు మండలం వేమవరంలో జరుగుతుందని మహబూబ్ సుభానీ మంగళవారం తెలిపారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 21,490 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



డివైడర్ ఎక్కిన బస్సు

నాదెండ్ల: అద్దంకి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి చిలకలూరిపేట వైపు వెళుతూ గణపవరం వద్దకు రాగానే బ్రేక్ ఫెయిల్ కావటంతో డివైడర్ ఎక్కింది.

న్యూస్‌రీల్

బాధితులకు ఆర్థిక సాయం అందజేత



నరసరావుపేట: గత ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన వర్గీయుల దాడిలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆ రెండు పార్టీల దౌర్జన్యాలకు గురైన మాబు సుభాని, బాషాలకు పార్టీ తరఫున అందజేసిన చెక్కులను పంపిణీ చేశారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరికి సహాయం చేశారన్నారు. గతంలో కూడా కొంగితాల రామయ్య, కొప్పనబోయిన శ్రీనివాసరావులకు కూడా ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. పమిడిపాడు గ్రామంలో ఇప్పటివరకు గాయపడిన పార్టీ కార్యకర్తలకు రూ.2.5లక్షలు సహాయం అందజేయటం జరిగిందన్నారు. భవిష్యత్తులోనూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని, అందరం కలిసి పార్టీని బలోపేతం చేసి మళ్లీ అధికారంలోకి తీసుకువద్దామని చెప్పారు.

పునీత అంతోనివారి జీవితం ఆదర్శనీయం

ఫాదర్ బాలస్వామిరెడ్డి




రెంటచింతల: కథోలికులందరూ సుగుణశీలి అయిన పునీత అంతోనివారి జీవితం ఆదర్శంగా తీసుకోవాలని మేడికొండూరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ గంటి బాలస్వామిరెడ్డి అన్నారు. స్థానిక అంతోనివారి కాలనీలోని అంతోనివారి మందిరంలో నిర్వహిస్తున్న 9 మంగళవారోత్సవాలలో భాగంగా తొలి మంగళవారం కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ వైల్ మర్రెడ్డి నేతృత్వంలో సమిష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి యువత ఎంతో నీతివంతుడైన పునీత అంతోనివారి అడుగు జాడల్లో నడుస్తూ కుటుంబ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. ఏసుక్రీస్తు సూక్తులను అంతోనివారు ఆచరించి పునీతుడయ్యారని ఆయన అడుగుజాడలలో కథోలికులు నడిచి ఏసుక్రీస్తుకు నిజమైన భక్తులుగా సమాజంలో మెలగాలన్నారు. మందిరాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో కానుకమాత చర్చి సహాయక గురువులు ఫాదర్ అగస్టీన్, కన్యాస్త్రీలు, మందిరం పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూకు రానున్న ఎన్‌ఐఆర్‌ఎఫ్ నిపుణుల బృందం



ఏఎన్‌యూ: ఎన్‌ఐఆర్‌ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) నిపుణుల బృందం ఈ నెల 25, 26వ తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించనుందని రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తెలిపారు. ఆ రెండు రోజుల్లో యూనివర్సిటీలోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఏ విధమైన సెలవులు మంజూరు చేయబడవన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సెలవులు పెట్టుకోవాల్సిన వారు సంబంధిత అధికారుల నుంచి ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

పలు రైళ్లు రద్దు



లక్ష్మీపురం: సౌత్‌సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో దానా తుపాన్ కారణంగా డివిజన్ మీదుగా పలు రైళ్లను రద్దు చేశారు. డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం ఈ విషయం తెలిపారు. నెంబర్ 17016 సికింద్రాబాద్-భువనేశ్వర్ 23వ తేదీన, 12703 హౌరా-సికింద్రాబాద్, 18047 షాలిమార్-వాస్కో రైలు 24న, 12514 షాలిమార్-వాస్కో, 18464 బెంగళూరు-భువనేశ్వర్, 12704 సికింద్రాబాద్-హౌరా 23న, 03429 సికింద్రాబాద్-మాల్దా టౌన్ 24న, 12513 సికింద్రాబాద్-సాలీచర్ రైలు 26న, 17015 భువనేశ్వర్-సికింద్రాబాద్, 18463 భువనేశ్వర్-బెంగళూరు సిటీ రైలు 25వ తేదీన రద్దు అయ్యాయి.

> ఉప్పులేనిదే వంటకానికి రుచి రాదు.. శ్రమించి పండించే రైతు లేనిదే వంటింట్లోకి ఉప్పు రాదు.. అయితే ప్రస్తుతం ఉప్పు రైతుల జీవితాలు రుచీపచీ లేకుండా చప్పగా సాగుతున్నాయి. వరుణ దేవుడి ప్రతాపంతో ముంచెత్తిన వానలు సాగును కకావికలం చేయగా, పాడైన భూములను తిరిగి సాగులోకి తెచ్చేందుకే నెలలు సమయం పట్టేట్టుగా ఉంది. దీంతో సాగును నమ్ముకున్న రైతులు, కూలీల కుటుంబాలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఉపాధి కరువై బతుకు దినదినగండంగా మారింది.



చినగంజాంలో వర్షపు నీరు చేరి కరిగిపోయిన ఉప్పు నీటి కట్టలు

చప్పగా ఉప్పు సాగు

- జిల్లాలో సుమారు 4500 ఎకరాల్లో ఉప్పు సాగు
- భారీ వర్షాలతో నిలిచిన సాగు
- రెండు నెలలుగా పనులు లేక రైతులు, కూలీల పాట్లు
- ఉపాధి కోసం ఎదురు చూస్తున్న కూలీలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

చినగంజాం: అసలే ప్రభుత్వం పట్టికోక ఇబ్బందులు పడుతున్న ఉప్పు రైతులను.. పుండుమీద కారం చల్లినట్లుగా వరుణ దేవుడు నట్టేట ముంచాడు.

జిల్లాలో ఉప్పు సాగు వర్షార్పణం

తుపాను కారణంగా ఉప్పు సాగుకు రెండు నెలలు పాటు విరామం ఏర్పడింది. ఎడతెరపి లేకుండా పక్షం రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు ఉప్పు కొఠారు భూములు పూర్తిగా మునిగిపోయాయి. ప్రస్తుతం ఉప్పు భూముల్లో ఎటు చూసినా వర్షపు నీరు దర్శనమిస్తోంది. తుపాను హెచ్చరికలు మేరకు వాతావరణం ఉప్పు సాగుకు అనుకూలంగా లేదు.

పూర్తిగా నీటమునిగిన కొఠారులు..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుమారు 4500 ఎకరాలలో ఉప్పు సాగు జరుగుతుంది. జిల్లాలోని చినగంజాం, కొత్తపట్నం, కనపర్తి, ఊళ్లపాలెం తదితర ప్రాంతాలలో ఉప్పు సాగు అధికంగా జరుగుతుంది. కొద్దిపాటి వానలకు వారం నుంచి పది రోజులు మాత్రమే ఉప్పు భూముల్లో సాగుకు ఆటంకం కలిగేది. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలతో కొఠారులు పూర్తిగా నీట మునిగి భూములు దెబ్బతిన్నాయి. నిల్వ ఉంచిన ఉప్పు కుప్పలను రైతులు తాటాకు, పరదాల కప్పి జాగ్రత్త చేసుకోవడంతో పెద నష్టం తప్పింది. ఉప్పు భూములు పూర్తిగా వర్షపు నీటిలో మునిగిపోగా వర్షం ఉధృతి తగ్గినప్పటికీ భూముల్లో నిలిచిన నీరు బయటకు పోయే పరిస్థితి కన్పించడం లేదు. దాంతో రెండు నెలలు పాటు ఉప్పు సాగుపై ఆధార పడిన రైతులు, కూలీలకు కష్టమొచ్చిపడింది.

ఆదాయం, ఉపాధి కరువు..

ఉప్పు భూముల్లో సాగు నిలిచి పోవడంతో రైతుల ఆదాయానికి, కూలీల ఉపాధికి గండి పడింది. ముఖ్యంగా ఉప్పు సాగుమీద ఆధారపడి జీవనం గడుపుతున్న వందలాది కూలీల కుటుంబాలకు రెండు నెలలపాటు కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఉప్పు రైతులతే తమ భూములలో డిసెంబరు, జనవరి నెలల్లో కొత్త ఉప్పును ఉత్పత్తి చేసే పనిలో బిజీగా ఉండి తాము పెట్టిన పెట్టుబడికి ఆదాయం తీసే పనిలో ఉంటారు. అయితే ప్రస్తుత పరిస్థితిలో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పు సాగుకే రెండు నెలలు సమయం పడితే సాగు మొదలయ్యాక ప్రకృతి వైపరీత్యాలు తట్టుకొని సాగు సాఫీగా సాగే పరిస్థితి ఉంటుందో లేదో అన్న సంశయం వారిలో నెలకొంది.


సాగుకు సమయం ఆసన్నమైనప్పటికీ..

ఉప్పు భూములలో సాగు పనులు అక్టోబరు, నవంబర్, డిసెంబరు నెలల్లో మొదలు పెడతారు. ప్రతి ఏడాది రైతులు, కూలీలకు కొఠారు పనులు ముమ్మరంగా ఉంటాయి. అటువంటిది ఈ ఏడాది అక్టోబరులో ఏర్పడిన అల్పపీడనం, తుపాను ప్రభావాలతో కురిసిన వర్షంతో నవంబర్, డిసెంబరు నెలలు పూర్తయ్యేంత వరకు పనులు ఉండేలా లేవు. ఈ పాటికే కొఠారు భూముల్లో కట్టలు



పోయడం, ఎక్కాలు, గంజేరులు, పంట మడులు నిర్మాణం చేయడం వంటి పనులు చేపడతారు. అటువంటింది కొఠారు భూములలో నీటిని తరలించేందుకు నెలకు పైగా సమయం పట్టేలా ఉంది. అటు తరువాత సాగుకు భూమిని సిద్ధం చేయడానికి మరికొంత సమయం పట్టేలా ఉంది.

రెండు నెలలపాటు సాగు లేనట్లే..



భారీ వర్షాల కారణంగా కొఠారు భూములు పూర్తిగా నీటితో నిండి పోయాయి. నిలిచిన నీటిని పోగొట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. ఆటు పోటుల ద్వారా నీరు పోవాల్సిందే. నీరు పోయి భూములు ఖాళీ అయ్యేంతవరకు ఏమీ చేయలేని పరిస్థితి. దాదాపు రెండు నెలలు పాటు సాగు విరామం ఏర్పడినట్లే. ఉప్పు కొఠారు పనుల మీద ఆధారపడి జీవనం చేసే మా లాంటి వారి పరిస్థితి కష్టమే.

– బక్కా బాజిరెడ్డి, కూలీ, కొత్తపాలెం

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



విద్యాశాఖాధికారులతో సమావేశమైన హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు అధ్యక్షతన గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యాశాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రోత్సహిస్తూ ప్రతి యేటా జెడ్పీ పాలకవర్గ ఆధ్వర్యంలో సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రెండేళ్లుగా పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అధిక మార్కుల సాధనకు ప్రయోజనం చేకూర్చిందని వరుసగా మూడో ఏడాది స్టడీ మెటీరియల్ పంపిణీకి చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను డిసెంబర్ 10లోపు విద్యార్థులకు అందించేలా ప్రణాళికలను రూపొందించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. నూరు శాతం ఉత్తీర్ణతకు దోహదం చేసే విధంగా ఉండటంతోపాటు జిల్లాలోని నిష్ణాతులైన ఉపాధ్యాయులచే రూపొందించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ చదువుతున్న 34,573 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉందని ఆయా జిల్లాల డీఈవోలు చైర్‌పర్సన్, సీఈవో దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పేదల కలెక్టర్ ఎస్‌ఆర్ శంకరన్

ఎస్‌ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా నివాళులర్పించిన జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల: పేదల కలెక్టర్‌గా ఎస్‌ఆర్ శంకరన్ ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఎస్‌ఆర్ శంకరన్ జయంతి కార్యక్రమం మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జరిగింది. కలెక్టరేట్ ఆవరణలోని ఎస్‌ఆర్ శంకరన్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పేదల కలెక్టర్‌గా పేరొందిన శంకరన్ నేటి ఐఏఎస్ అధికారులందరికీ ఆదర్శప్రాయుడన్నారు. ఎస్‌ఆర్ శంకరన్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి పీసీ సాయిబాబు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ కె.హరగోపాల్, రిటైర్డ్ ఐఏఎస్‌లు ఎస్.చక్రవర్తి, ఎన్.రమేష్ కుమార్, ఆర్.సుబ్రమణ్యం, డి.చక్రపాణి, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మనోబంధు ఫౌండేషన్ ఏర్పాటుచేసిన మనోబంధు మొబైల్ వాహనాన్ని జేసీ జెండా ఊపి ప్రారంభించారు. నిరాశ్రయులై, నిరాధారణకు గురైన మానసిక దివ్యాంగులను పునరావాస కేంద్రాలకు ఈ వాహనం తరలిస్తుందన్నారు. మనోబంధు ఫౌండేషన్ నిర్వాహకులు బి.రామకృష్ణంరాజు, సభ్యులు డి.ఇమ్మానియేలు, తదితరులు పాల్గొన్నారు.

వయోజనుల్లో అక్షరాస్యత శాతం పెంచాలి...

వయోజనులకు విద్యాబోధనతో అక్షరాస్యత శాతం పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.



ఎస్‌ఆర్ శంకరన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ ప్రఖర్ జైన్, విశ్రాంత ఐఏఎస్‌లు తదితరులు

వయోజన విద్యపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని జేసీ చాంబర్లో జరిగింది. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఉల్లాస్ (జీవన పర్యంతరం విద్య అవకాశాలను అందించడం) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని జేసీ ప్రఖర్‌జైన్ తెలిపారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో 15,268 మంది నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. వయోజన విద్య ఉపసంచాలకులు బి.జగన్‌మోహన్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ మధుసూదన్ రావు, డీపీఓ ప్రభాకర్, ఐసీడీఎస్ పీడీ ఉమా, డీఎల్‌డీఓ సువార్త, కె.మనోరంజన్, ఏపీఎం బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి టీడీపీ యువత బీభత్సం

- రెండు వర్గాలుగా విడిపోయి నడిరోడ్డుపై ఘర్షణ.. పరస్పరం దాడులు
- అందులో నియోజకవర్గ ముఖ్యనేత డ్రైవర్‌తో సహా పలువురు అనుచరులు

చీరాల: నడిరోడ్డుపై తెలుగుదేశం పార్టీకి చెందిన యువకులు స్ట్రీట్ ఫైట్‌కు దిగారు. అందులో ముఖ్యనేతకు చెందిన కార్యకర్తలే ఉండడం విశేషం. చివరకు పోలీసులు సైతం వారిని అడ్డుకోలేకపోయారు. ఇదీ చీరాలలో సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. చీరాల రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో కొందరు యువకులు నడిరోడ్డుపై బీభత్సం సృష్టించారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఓ టిఫెన్ హోటల్ వద్ద టిఫిన్ చేసేందుకు వచ్చిన యువకుల మధ్య చిన్నపాటి గొడవ కాస్త చిలికి చిలికి గాలివానలా మారింది. హోటల్ బయటకు వచ్చిన తర్వాత ఇరువర్గాల యువకులు ఘర్షణ పడ్డారు. యువకులు పిడిగుద్దులతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో ఒక్కసారిగా రైల్వేస్టేషన్ సమీపంలో ఉద్రిక్తత ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టే క్రమంలో సదరు యువకులు పోలీసుల ముందే మరోసారి బాహాబాహీకి దిగారు. ఓ యువకుడికి తీవ్ర గాయమై రక్తస్రావమైంది.

వదిలేసిన పోలీసులు..

అర్ధరాత్రి చీరాల రైల్వేస్టేషన్ ఎదురుగా యువకులు



రైల్వేస్టేషన్ ఎదురుగా అర్ధరాత్రి యువకుల ఘర్షణ

దాడులకు తెగబడటంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. అయితే ఈ ఘటనకు కారకులైన యువకుల్లో స్థానిక ముఖ్యనేతకు చెందిన వాహన డ్రైవర్, అతని స్నేహితులతో పాటు మరో వర్గం కూడా ఉన్నారు. అధికార పార్టీకి చెందిన యువకులు రాజకీయ అండతో రెచ్చిపోవడంపై చీరాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సైతం వారిని వదలివేశారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. పోలీసులు అధికార పార్టీ నేతలు, వారి అనుచరుల ఆగడాలను అడ్డుకోలేరా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ సీఐ శ్రీనివాసరావును వివరణ కోరగా కూల్ డ్రింక్ షాపు వద్ద రెండు వర్గాల యువకుల మధ్య ఏర్పడిన చిన్న వివాదం పెద్ద ఘర్షణకు దారితీసిందని, ఇరువర్గాలను గుర్తించి మొదటితప్పుగా మందలించి హెచ్చరించి పంపించామన్నారు. మైనర్లు కూడా ఉండటం వలన బైండోవర్లు చేసి పంపించామన్నారు. ఇలాంటివి జరగకుండా రాత్రి సమయాల్లో గస్తీని, బీట్లు పెంచుతున్నామని తెలిపారు.

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

- 48 గంటల్లోనే నిందితులను పట్టుకున్న బాపట్ల పోలీసులు
- రూ.39 లక్షలు నగదు, కారు స్వాధీనం
- వెల్లడించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల: ఒంగోలు – గుంటూరు రహదారి మధ్యలో జరిగి సంచలనాత్మకంగా మారిన భారీ దారి దోపిడీ కేసును ఛేదించిన బాపట్ల జిల్లా పోలీసులను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఫిర్యాది తల్లం స్వరూప్ కుమార్‌కు గుంటూరు నగరంలో సాయి రామకృష్ణ జ్యూయల్లరీ షాప్ ఉందన్నారు. చెన్నైలో బంగారం కొనడానికి తన స్నేహితుడు, డ్రైవర్ శ్రీనివాసరావు ఐచర్ వాహనంలో గుంటూరు నుంచి ఈనెల 18వ తేదీ రాత్రి బయలుదేరారు. 19న అర్ధరాత్రి సమయంలో గుంటూరు – ఒంగోలు రోడ్డులో కొరిశపాడు ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న ఎమర్జెన్సీ ల్యాండింగ్ పాయింట్ వద్ద, నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు నంబర్‌లేని వైట్ కలర్ షిఫ్ట్ కారుతో ఐచర్ వాహనాన్ని అకస్మాత్తుగా అడ్డుకున్నారు. వాహనంలో వున్న తల్లం స్వరూప్ కుమార్‌ను బలవంతంగా కిందికి దించి కర్రల సంచిలోని రూ.39.50 లక్షల నగదు, మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కుని, అతడిని తమ కారులో ఎక్కించుకుని ఒంగోలు వైపు కొంతదూరం తీసుకెళ్లి మళ్లీ సంఘటనా స్థలానికి తీసుకుని వచ్చి స్వరూప్‌ను దించి, ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించి వెళ్లి పోయారు. దీంతో బాధితుడు 19న ఉదయం మేదరమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

మేరకు మేదరమెట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. చీరాల డీఎస్పీ పి.జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో అద్దంకి రూరల్ సీఐ డి.మల్లికార్జునరావు, సీసీఎస్ సిఐ పి.ప్రేమయ్య, మేదరమెట్ల, కొరిశపాడు, జె.పంగులూరు ఎస్సైలు షేక్ మహ్మద్ రఫీ, వై.సురేష్, బి.వినోద్ బాబులు వారి సిబ్బందితో 4 ప్రత్యేక బందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, టోల్‌గేట్‌ల వద్ద వున్న సమాచారం, సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా, ప్రత్యక్ష సాక్షులు చెప్పిన కథనాలను బట్టి నిందితులను గుర్తించి సోమవారం సాయంత్రం మేదరమెట్ల జంక్షన్ వద్ద అద్దంకి రూరల్ సీఐ, సిబ్బంది సహకారంతో మధ్యవర్తుల సమక్షంలో నిందితులైన కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలానికి చెందిన ధనికొండ వెంకన్న స్వామి, కాటూరి గ్రామానికి చెందిన పగడాల మహేష్, టెంటు కార్తీక్ , పూరేటి శివ శ్రీనివాసరావులను అరెస్ట్ చేశారు. నేరం చేసేందుకు ఉయోగించిన కారు, టార్చ్‌లైట్, బాధితుడి దగ్గర నుంచి దోపిడీ చేసిన రూ. 39 లక్షల నగదు తదుపరి దర్యాప్తు నిమిత్తం స్వాధీన పరుచుకున్నామన్నారు.

నేరం చేశారిలా..

నేరస్తులు ఒకే గ్రామానికి చెందిన స్నేహితులు. వీరిలో ధనికొండ వెంకన్నస్వామి డ్రైవర్ గాను, పగడాల మహేష్ కార్పెంటర్‌గాను, టెంటు కార్తీక్, పూరేటి శివ శ్రీనివాసరావులు వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తుంటారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల, సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో నలుగురు కలిసి పెద్ద దొంగతనం చేసి స్థిరపడదాం అనుకున్నారు. వెంకన్నస్వామి గతంలో విజయవాడలోని వెంకట రమణ ట్రావెల్స్‌లో డ్రైవర్ గా పని చేశాడు. ఆ సమయంలో చెన్నై వెళ్లే లారీల్లో గుంటూరు, చిలకలూరిపేట, వలపర్ల ప్రాంతాలలోని బంగారు వ్యాపారస్తులు చెన్నైలో బంగారం కొనడానికి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని వెళ్లేవారని, వారిని గుర్తించి, బెదిరించి నగదు దోచుకోవాలని ప్రణాళిక వేశారు. 18 రాత్రి విజయవాడలోని ఓ ట్రావెల్స్‌లో కారు అద్దెకు తీసుకుని.. వెంకటరమణ ట్రావెల్స్ వారి ఐచర్ లారీని విజయవాడ నుంచి ఫాలో అవుతూ గుంటూరులో బాధితుడు కర్రల సంచితో లారీ ఎక్కడం గమనించారు. నిర్మానుష్య ప్రదేశంలో లారీ ఆపించి నగదు దోపిడీ చేశారన్నారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన అద్దంకి రూరల్ సర్కిల్ సీఐ డి.మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్ఐ వై.సురేష్, జె.పంగులూరు ఎస్ఐ బి.వినోద్ బాబు, మేదరమెట్ల ఏఎస్ఐ షేక్ మహమ్మద్, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించి, రివార్డులు అందజేశారు. అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్, చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్, అద్దంకి రూరల్ సర్కిల్ సీఐ డి. మల్లికార్జున పాల్గొన్నారు.

మాజీ ఎంపీ నందిగంను పరామర్శించిన అశోక్‌బాబు

వేమూరు: తెలుగు దేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దళితులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెడుతూ, వేధింపులకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు జైలులో మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అశోక్ బాబు కలుసుకుని పరామర్శించారు. అనంతరం జైలు బయట ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలులో ఉందని, దళితులను, దళిత నేతలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం, మానసికంగా హింసించడం ఒక పద్ధతిగా జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దళితులు అంటే చులకన అని, దానికి నిదర్శనమే ఈ అక్రమ అరెస్టులు, వేధింపులు అని దుయ్యబట్టారు. అధికారం శాశ్వతం కాదని అధికార పార్టీ నేతలు తెలుసుకోవాలని హితవు పలికారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ప్రార్థనలు చేసుకోవాలా..వద్దా?



చర్చి వద్ద వైన్‌షాపు వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

కూటమి ప్రభుత్వంలో బడి లేదు..గుడి లేదు ఎక్కడ పడితే అక్కడ వైన్‌షాపులు దర్శనమిస్తున్నాయి. కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం ఎస్సీ కాలనీకి సమీపంలో నిడమానూరు రోడ్డులోని కవెనెంట్ చర్చి వద్ద మద్యం దుకాణం తెరిచేందుకు ఓ వ్యాపారి మంగళవారం పనులు ప్రారంభించాడు. దీంతో చర్చి సభ్యులు, కాలనీ వాసులు ఆ రోడ్డులో వాహనాలు ఆపి నిరసన తెలిపారు.

– మేదరమెట్ల

క్లుప్తంగా

సర్వేలో తప్పులను సరిచేసుకోండి

రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి



రేపల్లె రూరల్: గ్రామీణ ప్రాంతాలలో తమ భూములలో జరిగిన సర్వేలో తప్పులు ఉంటే సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆర్డీఓ నేలపు రామలక్ష్మి అన్నారు. మండలంలోని కారుమూరు గ్రామంలో భూ రీసర్వేపై మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. సర్వేలో హద్దులు సరిగా చూపకపోయినా, ఇతర సాగుభూములతో తమ సాగుభూముల సరిహద్దులు సరిగా లేకపోయినా గ్రామసభ దృష్టికి తీసుకువచ్చి సరిచేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో 20 అర్జీలు అందినట్లు చెప్పారు. సమస్యలను అధికారులచే త్వరితగతిన పరిష్కరించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్చక పరీక్షల దరఖాస్తుకు గడుపు పెంపు

వేమూరు: రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అర్చక పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు జిల్లా అర్చక సేవా సంఘం కన్వీనర్ మేడూరు శ్రీనివాసమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఆగమనాలకు సంబంధించిన అభ్యర్థులు ప్రవేశ, వర ప్రవర్తన స్థాయి పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

రేపు సైక్లింగ్ జట్టు ఎంపిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సైక్లింగ్ జట్టు ఎంపిక పోటీలను గురువారం నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు స్కూల్ గేమ్స్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-14, అండర్-17 బాల,బాలికల జట్లు ఎంపిక చేస్తారని వివరించారు. ఎంపిక పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ఇస్మాయిల్, ఎం.వి.సుబ్బారావు, పి.ఖాదర్‌మస్తాన్ పాల్గొన్నారు.

రైతుబజార్లను సద్వినియోగం చేసుకోండి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్



రైతు బజారును ప్రారంభిస్తున్న జేసీ ప్రఖర్ జైన్, ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల: రైతు ఉత్పత్తులు నేరుగా విక్రయించుకునే అవకాశం కల్పిస్తూ రైతు బజార్లను ప్రభుత్వం ప్రారంభిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. బాపట్ల పట్టణంలోని ఎన్టీఆర్ కూరగాయల మార్కెట్ వద్ద మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతు బజార్‌ను బాపట్ల శాసన సభ్యుడు వేగేశన నరేంద్ర వర్మతో కలిసి ఆయన రిబ్బన్ కత్తిరించి మంగళవారం ప్రారంభించారు. రైతులకు మేలు కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జేసీ తెలిపారు. రైతులు పండించుకున్న పంటలు నేరుగా రైతు బజార్లకు తెచ్చుకుని విక్రయించుకోవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రైతులను ప్రజలు ఆదరించాలని కోరారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి రైతు బజార్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. మార్కెటింగ్ శాఖ డీడీ ఝాన్సీరాణి, మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్ బాబు, ఆ శాఖ డీఈఈ పవన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, రైతు బజార్ పర్యవేక్షణ అధికారి జి.ఫణీంద్ర, శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జేసీ పుట్టినరోజు సందర్భంగా ఆయనతో ఎమ్మెల్యే కేక్ కట్ చేయించారు.

పాలనలో నూతన శకానికి నాంది పలికిన శంకరన్

ప్రొఫెసర్ జి.హరగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న జి.హరగోపాల్

బాపట్ల: ప్రభుత్వ పాలనలో నూతన శకానికి నాంది పలికిన యుగకర్త ఎస్ఆర్ శంకరన్ అని హైదరబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. హరగోపాల్ అన్నారు. మంగళవారం ఎస్ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా ప్రజాస్వామ్యం – సుపరిపాలన అంశంపై ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ బాపట్ల పౌర సమాఖ్య ఏర్పాటు చేసిన శంకరన్ స్మారక సెమినార్‌లో హరగోపాల్‌తో పాటు అనేకమంది రిటైర్డు ఐఏఎస్ అధికారులు ఎస్ఆర్ శంకరన్‌తో ఉన్న అనుభవాలను ఈ సందర్భంగా పాలుపంచుకున్నారు. హరిగోపాల్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రజాస్వామ్యం పది కాలాల పాటు పరిఢవిల్లాలంటే శంకరన్ లాంటివాళ్లు సమాజానికి ఎంతో అవసరమన్నారు. సుపరిపాలనపై ఆయన చేసిన ఆలోచనత్మాక నిర్ణయాలు, వివరణాత్మక ఆశయాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ఎన్నో కీలకమైన నిర్ణయాల్లో ఒక నిర్మాణాత్మకమైన సుపరిపాలనకు శ్రీకారం చుట్టిన శంకరన్ సివిల్స్‌లో ఒక గొప్ప శ్రీ మంతుడుగా పేద ప్రజలకు సేవలు అందించారన్నారు. రిటైర్డు ఐఏఎస్ అధికారులు నిమ్మగడ్డ రమేష్ కుమార్, ఎస్.చక్రవర్తి, ఎస్.రమేష్ కుమార్, ఆర్.సుబ్రహ్మణ్యం, చక్రపాణి, కె.విజయకుమార్, శరత్ బోస్, శంకరం మెమోరియల్ ట్రస్టీలు వీసీ సాయిబాబు, జి.వెంకటేశ్వర్లు, కరణం రవీంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

కేసును తప్పదోవ పట్టిస్తే ఊరుకోం



దళిత సంఘాల నేతలు, వివిధ పార్టీల నాయకులు

గుంటూరు మెడికల్: రౌడీ షీటర్ దాడిలో తీవ్ర గాయాలపాలై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సహానాను మంగళవారం జిల్లాకి చెందిన దళిత ఉద్యమ నేతలు, ఆయా పార్టీల నాయకులు పరామర్శించారు. సంఘటన గురించి బాధితురాలి తల్లిదండ్రుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే బాధితురాలికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, నిందితుడు నవీన్‌ను పూర్తిస్థాయిలో విచారించాలని డిమాండ్ చేశారు. నిందితుడికి సహాయం చేసిన వ్యక్తులను కూడా కేసులో చేర్చాలన్నారు. కేసు తప్పుదోవ పట్టకుండా చట్టపరమైన శిక్షలు పడేలా పోలీసు దర్యాప్తు చేయాలని కోరారు. కేసును తప్పుదోవ పట్టిస్తే ఊరుకోబోమని దళిత నేతలు హెచ్చరించారు. తప్పుతోవ పట్టిస్తున్న తెనాలి రెండో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాషాను వెంటనే విధుల నుంచి తొలగించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. పరామర్శించిన వారిలో మాల మహానాడు అధ్యక్షుడు అన్నవరపు కిషోర్, గుర్రం రామారావు, బొనిగల ప్రదీప్, మాల యువసేన అధ్యక్షుడు పొందుగల చైతన్య, వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, బీఎస్పీకి చెందిన కారుమంచిలి సందీప్, బత్తుల అనిల్ , చిన్నం డేవిడ్ విలియమ్స్, నల్లపు నీలాంబరం కనకవల్లి, వినయ్, మంచాల జోసెఫ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో వృద్ధుడు మృతి

సూరేపల్లిలో విషాదఛాయలు



మృతి చెందిన లింగయ్య

బల్లికురవ: డాబాపైకి ఎక్కగా ప్రమాదవశాత్తు విద్యుత్ సప్లయ్ వైరు తగిలి వృద్ధుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈఘటన సోమవారం రాత్రి బల్లికురవ మండలంలోని ముక్తేశ్వరం పంచాయతీలోని సూరేపల్లి గ్రామంలో జరిగింది. సేకరించిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రావులపల్లి లింగయ్య (77) భోజనం చేశాక చుట్ట తాగే అలవాటు ఉంది. డాబా పైకి ఎక్కి అటుఇటు తిరుగుతూ చుట్ట తాగుతుండగా డాబా పక్కగా వెళ్తున్న విద్యుత్ సప్లయ్ వైరు తగలటంతో విద్యుదాఘాతానికి గురై గాయాలపాలయ్యాడు. భర్త ఎంతకీ కిందకి దిగి రాకపోవటంతో భార్య అంజమ్మ డాబా ఎక్కి చూడగా తలకు గాయమై విగతజీవిగా లింగయ్య పడిఉండటం చూసి బోరున విలపించింది. మంగళవారం భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జీవీ చౌదరి కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు కలరు. అందరితో కలివిడిగా ఉండే లింగయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కారు ఢీకొని యువకుడు దుర్మరణం



మృతి చెందిన రాజశేఖర్

మార్టూరు: రోడ్డు దాటుతున్న యువకుడిని కారు ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈప్రమాదం స్థానిక జాతీయ రహదారిపై జొన్నతాళి స్టేజీలో వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. సీఐ ఎం.శేషగిరిరావు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన అందే రాజశేఖర్ (35) పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాజశేఖర్ మంగళవారం సాయంత్రం జొన్నతాళి స్టేజీలో రోడ్డుకు పడమర వైపున తన బైకు ఆపి తూర్పు వైపున నిలబడి ఉన్న తన తండ్రి ఆదినారాయణ వద్దకు వెళ్లటం కోసం రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో ఒంగోలు వైపు నుంచి మార్టూరు వైపు వేగంగా వెళ్తున్న ఓ కారు రాజశేఖర్‌ను బలంగా ఢీకొట్టింది. రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని రాజశేఖర్‌ను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సీఐ మద్దినేని శేషగిరిరావు పర్యవేక్షణలో మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, అందులోని వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదుపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దీపావళి మందుగుండు సామగ్రి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలోని గరువుపాలెంలో దీపావళి మందు గుండు సామగ్రిని అక్రమంగా తయారు చేస్తున్న వ్యక్తిని మంగళవారం చేబ్రోలు పోలీసులు అరెస్ట్ చేశారు. వడ్లమూడి గరువుపాలెంలో నేల టపాసులు తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో ఎస్ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఇంట్లో ఇరువురు వ్యక్తులు టపాసులు తయారు చేస్తుండగా పోలీసులు రాకను గమనించి ఒక వ్యక్తి పారిపోయాడు. మరొకర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శేకూరు గ్రామానికి చెందిన బూరగ సైదా, అతడి స్నేహితుడు నారాకోడూరు గ్రామానికి చెందిన ముప్పవరపు సంజయ్ సారథి కలిసి కొద్ది సంవత్సరాలుగా ఇలా చేస్తున్నారని తెలిసింది. గరువుపాలెం గ్రామంలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకొని అందులో పేలుడు పదార్థాలు నిల్వ చేశారు. 10 రోజులుగా ఈ ఇంటిలో నేల టపాసులు తయారు చేస్తున్నారు. కొన్ని ప్యాకెట్ల నేల టపాకాయలు, ఉపయోగించే ముడి సరుకులను స్వాధీనం చేసుకున్నారు. సైదాపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.. సారథిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

బేస్‌బాల్ పోటీలకు సాతులూరు క్రీడాకారులు



నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు బేస్‌బాల్ పోటీలకు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. మందడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎంపిక పోటీల్లో అండర్-14 విభాగంలో 9వ తరగతి చదువుతున్న బోరుగడ్డ అనురాధ, 8వ తరగతి చదువుతున్న గురిగింజల ధనుష్, అండర్-17 విభాగంలో పూర్వ విద్యార్థి మద్దుకూరి లీలావెంకట బాలాజీ ఎంపికయ్యారు. త్వరలో తిరుపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ముగ్గురు క్రీడాకారులు పాల్గొననున్నారు. హెచ్ఎం వి.వెంకటరావు, పీడీ కె అంజమ్మ, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

విద్యలో ప్రతి ఒక్కరూ రాణించాలి



నగరంపాలెం: పిల్లలకు విద్య, వైద్యం, ఇతర త్రా మౌలిక సదుపాయాలు కల్పనలో రాజీ పడొద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి అన్నారు. జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం నిర్వహిస్తున్న హోమ్స్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు ఆయా సంస్థల్లో సోదాలు చేపట్టారు. స్వర్ణభారత్‌నగర్‌లోని దాక్షిణ్య స్పెషల్ స్కూల్ ఫర్ ఐడీ, కాకాని రోడ్‌లోని లీమా డెఫ్ అండ్ మెంటల్లీ హ్యాండీక్యాప్డ్ బాయ్స్ వెల్ఫేర్ సంస్థను, నగరంపాలెంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతిగృహం, సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ -1, సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ -2, జడ్పీలోని బాలికా సదన్‌ను, పరివర్తనా భవన్, గోరంట్లలోని కారమల్ సేవ సదన్‌ను సందర్శించారు. అందులోని పిల్లలకు అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. పిల్లలను జాగ్రత్తగా చూడాలని అన్నారు. నాణ్యతమైన భోజనాన్ని అందించాలని చెప్పారు. చదువులో ప్రతి విద్యార్థి ముందంజలో ఉండేలా పర్యవేక్షించాలని అన్నారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణతో నాణ్యమైన విద్య



తాడికొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డి.లింగేశ్వరరెడ్డి అన్నారు. తుళ్లూరు మండలం పెదపరిమిలోని ముప్పా చిన బాపిరెడ్డి చారిటబుల్ ట్రస్టులో మంగళవారం గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఎస్‌జీటీలకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించి వారిలోని నైపుణ్యాలను వెలికితీయాలని సూచించారు. కార్యక్రమాన్ని జిల్లా డీఈవో పి. శైలజ సందర్శించారు. డీఆర్‌పీ, ఎస్‌జీటీలకు పలు సూచనలు అందజేశారు. ఎస్ఏఎల్‌టీ ప్రోగ్రాం డైరెక్టర్ సురేష్, ప్రధాన్ కంటెంటెంట్ లీలా పద్మ ఆకస్మికంగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌కే సలీం బాషా, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రేపల్లె రూరల్: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని సింగుపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ మల్లికార్జునరావు వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో తమ సిబ్బంది పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారన్నారు. దాడులలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.3100లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వీరిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.

రౌడీషీటర్ల కార్యకలాపాలను అణచివేయాలి

రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



మాట్లాడుతున్న రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలోని రౌడీషీటర్ల కార్యకలాపాలను పూర్తిగా అణచివేయాలని రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని రేంజ్ ఐజీ కార్యాలయంలో మంగళవారం జిల్లాల ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లా అండ్ ఆర్డర్, తీవ్రమైన నేరాలకు సంబంధించి కేసులపై ఆరా తీశారు. రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మాట్లాడుతూ.. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని అన్నారు. జిల్లాల్లోని అన్ని ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి పనితీరు నిత్యం సమీక్షించాలని చెప్పారు. కేసుల దర్యాప్తులలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సూచించారు. కమ్యూనిటీ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ద్వారా తప్పుడు ప్రచారాలు చేసే వారిని నియంత్రించాలని చెప్పారు. సైబర్ నేరాలు తగ్గించాలని సూచించారు. ఎస్పీలు సతీష్‌కుమార్ (గుంటూరు), శ్రీనివాసరావు (పల్నాడు), తుషార్‌డూడీ (బాపట్ల), దామోదర్ (ప్రకాశం), కృష్ణకాంత్ (ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా) పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు చేయూతనివ్వండి

చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలాజీ



ఆర్డీఓ రామలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న చేతి వృత్తిదారులు

రేపల్లె రూరల్: చేతి వృత్తిదారులకు కార్పొరేషన్ల ద్వారా రుణాలను మంజూరు చేసి ప్రోత్సహించాలని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేతివృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. సూపర్ సిక్స్ వాగ్దానాలతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినప్పటికీ చేతివృత్తులను ప్రోత్సహించేందుకు సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు చేపట్టక పోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వాల చేయూత లేకపోవడంతో ఆయా వృత్తిదారులు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేతివృత్తిదారులకు రుణాలను మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు. 50 సంవత్సరాలు నిండిన చేతి వృత్తిదారులకు సత్వరమే పింఛన్ మంజూరు చేయాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా 50 శాతం సబ్సిడీతో రూ.5 లక్షలు రుణాలను సొంత పూచీకత్తుతో మంజూరు చేయాలని, రాష్ట్ర జనాభాలో 30 శాతంగా ఉన్న చేతివృత్తిదారులకు 25 శాతం నిధులు కేటాయించి ఉప ప్రణాళిక ద్వారా నిధులు ఖర్చు చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బండారు శ్రీనివాసరావు, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి
- పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

చీరాల అర్బన్: బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మంగళవారం చీరాలలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలో పిల్లల హాజరు పట్టిక పరిశీలించారు. అలానే తరగతి గదిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ముందు వరుసలో కూర్చోబెట్టి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌ను పరిశీలించి మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యం స్టాకు తక్కువగా ఉండడాన్ని గమనించి హెచ్ఎంను వివరణ కోరారు. ఈపురుపాలెం బైపాస్‌లోని కేజీబీవీని పరిశీలించారు. అక్కడ లైట్లు సక్రమంగా లేకపోవడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే వేయించాలని సూచించారు. ఉమ్మడి ప్రకాశం, బాపట్ల జిల్లాలో చైల్డ్ ప్రొటెక్షన్ ఫోర్స్ సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీతో పాటు చైల్డ్ వెల్ఫేర్ కమిటీతో కలిసి బాలబాలికల అభ్యున్నతికి, రాబోయే తరాలకు మంచి భవిష్యత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆమె వెంట తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, హెచ్ఎంలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా సమన్వయకర్తకు వినతిపత్రం అందించిన సిబ్బంది



జిల్లా సమన్వయకర్త డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్యమిత్రలు

చీరాల రూరల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ ఫీల్డ్ సిబ్బంది సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని జిల్లా వైద్యమిత్ర అధ్యక్షుడు బడుగు రాజు పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైద్య ఆరోగ్య మిత్ర సిబ్బంది మంగళవారం జిల్లా సమన్వయకర్త సీహెచ్ ప్రవీణ్‌కుమార్‌కు బాపట్లలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో వైద్యమిత్రలుగా టీం లీడర్లుగా, జిల్లా మేనేజర్లుగా, ఆఫీస్ అసోసియేట్‌లుగా 17 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ కనీస వేతనాలు అమలు జరగడంలేదన్నారు. ట్రస్టు అధికారుల నుంచి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖాధికారులకు, మంత్రులకు, ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నప్పటికీ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. జరిగిపోయిన కాలంలో కొందరు సిబ్బంది ఉద్యోగ విరమణ చేశారని, మరి కొందరు ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నారన్నారు. తక్షణమే ఉన్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం తమ స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి 15 రోజుల గడువుతో ప్రభుత్వానికి ఏపీ వైద్యమిత్ర ఎంప్లాయిస్ యూనియన్ తరపున అల్టిమేటం లెటర్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈసమయంలో దశల వారీగా సానుకూలమైన పద్ధతులలో వివిధ రకాలుగా నిరసనలు తెలియజేయనున్నట్లు చెప్పారు. వైద్య మిత్రలు అన్నంగి రెబకా, కాకాని రాంబాబు, బోయాజ్, ప్రభాకర్, రాజశేఖర్, అనిల్, ఫణి, విజయశేఖర్‌లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీభ్రమర టౌన్‌షిప్స్ వార్షికోత్సవం



చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమంలో చైర్మన్, డైరెక్టర్లు

నగరంపాలెం: నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలనే ఆశయంతో 2015లో శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమి టెడ్‌ను ప్రారంభించినట్లు చైర్మన్ గల్లా రామచంద్రరావు తెలిపారు. శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎనిమిదేళ్లు పూర్తి కాగా, తొమ్మిదోవ వార్షికోత్సవాన్ని మంగళవారం గుంటూరు నగరంలోని సిద్ధార్థ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. వేడుకలను ప్రారంభించిన చైర్మన్ గల్లా రామచం ద్రరావు మాట్లాడుతూ గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాలో 30కి పైగా అద్భుతమైన ప్రాజెక్టులను అభివృద్ధి చేశామన్నారు. తద్వారా స్థిరాస్తి రంగంలో తమదైన ముద్ర వేశామని పేర్కొన్నారు. ఆధునికత, అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న ప్రస్తుత సమాజంలో కష్టమర్లకు విలాసవంతమైన జీవనశైలిని అందిస్తున్నామని అన్నారు. భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం కల 'పుర'ను స్ఫూర్తి గా తీసుకున్నామని తెలిపారు. చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకల్లో సంస్థ డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎంఎస్.రాజు, ఎంవీకే లక్ష్మీపతిరాజు, శైలారెడ్డి కోట, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణతోపాటు కాకర్ల సతీష్, కమ్మ రవి పాల్గొన్నారు.